సాక్షి
ఆదిలాబాద్
గురువారం, 31, ఆగస్టు, 2023



తీజ్ ఉత్సవాలు ప్రారంభం

శ్రావణమాసం పురస్కరించుకొని ఏజెన్సీ ప్రాంతంలో తీజ్ ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. గిరిజన యువతులు సంప్రదాయం పాటిస్తూ పాల్గొన్నారు. 8లో▸



నీకు నేను రక్ష.. నాకు నీవు రక్ష

అన్నా చెల్లెళ్లు, అక్కా తమ్ముళ్ల మధ్య ప్రేమానురాగాలకు ప్రతీకగా నిలిచే పండుగే రాఖీ. తమ సోదరులకు రాఖీ కట్టేందుకు సుదూర ప్రాంతాల నుంచి సోదరీమణులు తరలివస్తున్నారు. 8లో▸

గరిష్టం/కనిష్టం
34.0/25.0

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ ప్రభావం కనిపిస్తుంది. గాలిలో తేమశాతం పెరగనుంది.

న్యూస్‌రీల్

ఎమ్మెల్యేకు రాఖీ కట్టి..



ఆశీర్వచనం పొందుతున్న ఎమ్మెల్యే రామన్న

ఆదిలాబాద్: రాఖీ పండుగ పురస్కరించుకొని స్థానిక సంజయ్‌నగర్ శివాలయంలో బుధవారం రాత్రి ఎమ్మెల్యే జోగు రామన్నకు వేద పండితుల మంత్రోచ్ఛరణ మధ్య పలువురు మహిళలు రాఖీ కట్టి రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలియజేశారు. అంతకు ముందు ఎమ్మెల్యే దంపతులను ఆలయంలో ఘనంగా సన్మానించారు.

అంగన్‌వాడీల సమ్మె నోటీసు



డీడబ్ల్యూవోకు సమ్మె నోటీసు అందజేస్తూ..

ఎదులాపురం: అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్ల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని లేని పక్షంలో సెప్టెంబర్ 11 నుంచి సమ్మెకు వెళ్లనున్నట్లు ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఎస్.విలాస్ తెలిపారు. ఈ మేరకు జేఏసీ తరఫున బుధవారం డీడబ్ల్యూవో మిల్కాకు సమ్మె నోటీసు అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, అంగన్‌వాడీలకు కనీస వేతనం, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని డిమాండ్ చేశారు. సమ్మె నోటిసు అందించిన వారిలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి దేవేందర్, అంగన్‌వాడీలు చంద్రకళ, దుర్గా, ఇందు, భాగ్య తదితరులు ఉన్నారు.

ఎస్ఎస్ఏ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న రవీంద్ర

కైలాస్‌నగర్: సమగ్ర శిక్ష అభియాన్ (ఎస్ఎస్ఏ) లో పని చేస్తున్న ఒప్పంద ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లు వెంటనే నెరవేర్చాలని ఎస్టీయూటీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బెజ్జంకి రవీంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తమ సేవలను క్రమబద్ధీకరించాలనే డిమాండ్‌తో కలెక్టరేట్ ఎదుట ఎస్ఎస్ఏ ఉద్యోగులు చేపట్టిన ఆందోళన మూడో రోజుకు చేరింది. వీరికి సంఘ బాధ్యులతో కలిసి ఆయన బుధవారం మద్దతు ప్రకటించి మాట్లాడారు. 15 ఏళ్లుగా ప్రభుత్వం ఎస్ఎస్ఏ ఉద్యోగులతో వెట్టిచాకిరీ చేయించుకుంటుందని ఆరోపించారు. సమాన పనికి సమాన వేతనంతో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం నిరసనకారులు సీఎం కేసీఆర్ మాస్క్ ధరించిన సహఉద్యోగులకు రాఖీలు కట్టి నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎస్టీయు జిల్లా అధ్యక్షుడు అశోక్ కుమార్, రాష్ట్ర కార్యదర్శి సత్యనారాయణ పాల్గొన్నారు.

జెడ్పీ సర్వసభ్య సమావేశం వాయిదా

కైలాస్‌నగర్: సెప్టెంబర్ 1న నిర్వహించాల్సిన జెడ్పీ సర్వసభ్య సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్లు సీఈవో వి.గణపతి ప్రకటనలో తెలిపారు. అదే రోజున ప్రభుత్వం స్వాతంత్ర్య భారత వజ్రోత్సవాల ముగింపు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నందున చైర్మన్ జనార్దన్ రాథోడ్ ఆదేశాల మేరకు వాయిదా వేసినట్లుగా పేర్కొన్నారు. సమావేశ నిర్వహణ తదుపరి తేదీలను త్వరలోనే ప్రకటిస్తామని వెల్లడించారు. అధికారులు, సభ్యులు విషయాన్ని గమనించాలని ఆయన కోరారు.

వైద్యశాఖలో.. ప్రక్షాళన



రిమ్స్ ఆవరణలో ఉన్న లెప్రసీ వార్డు

- పీపీ యూనిట్, టీహెచ్‌డబ్ల్యూ వార్డుల తొలగింపు
- జిల్లాలో రెండు డిప్యూటీ డీఎంహెచ్‌వో పోస్టులు సైతం..
- అవసరం ఉన్న పీహెచ్‌సీలకు సిబ్బంది సర్దుబాటు
- నాణ్యమైన వైద్యసేవలే లక్ష్యం

ఆదిలాబాద్‌టౌన్: వైద్యారోగ్య శాఖలో ప్రక్షాళన చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందుకు సంబంధించి ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లాలో అవసరం లేని పోస్టులను రేషనలైజేషన్ చేసేందుకు కసరత్తు చేస్తోంది. ఫ్యామిలీ ప్లానింగ్ (పీపీ) యూనిట్, లెప్రసీకి సంబంధించిన టెంపరరీ హాస్పిటల్ వార్డు (టీహెచ్‌డబ్ల్యూ)తో పాటు డిప్యూటీ డీఎంహెచ్ పోస్టులనూ తొలగించనుంది. అలాగే ఈ కార్యాలయంలో పనిచేసే సిబ్బందిని మరో చోటుకు సర్దుబాటు చేయనుంది. రాష్ట్ర వైద్యారోగ్య శాఖ జీవో నం.142 పేరిట ఇటీవల జారీ చేసింది. దీంతో కొంత ప్రయోజనం దక్కనుండగా, పోస్టులు తొలగింపుపై ఆ శాఖ ఉద్యోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అయితే ఈ సర్దుబాటుతో పీహెచ్‌సీల్లో ఖాళీగా ఉన్న పోస్టులు భర్తీ కానున్నాయి.

ప్రక్షాళన ఇలా..

వైద్యారోగ్య శాఖ పరిధిలోనికి వచ్చే రిమ్స్‌లో ఫ్యామిలీ ప్లానింగ్ యూనిట్ ఉంది. కరోనాకు ముందు ఈ పీపీ యూనిట్‌లో కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేసేవారు. అయితే కొన్నేళ్లుగా అక్కడ ఎలాంటి శస్త్ర చికిత్సలు జరగడం లేదు. అక్కడ పనిచేసే సిబ్బంది, మెడికల్ ఆఫీసర్లు ఎలాంటి విధులు లేక ఖాళీగా ఉంటున్నారని ప్రభుత్వం ఆ యూనిట్‌ను తొలగించేందుకు చర్యలు చేపట్టింది. అలాగే రిమ్స్ ఆవరణలో లెప్రసీకి సంబంధించి టెంపరరి హాస్పిటల్ వార్డు ఉంది. గతంలో కుష్ఠు వ్యాధిగ్రస్తుల కోసం తాత్కాలికంగా బెడ్లు ఉంచి వారికి చికిత్స అందించేవారు. కొన్నేళ్లుగా అక్కడ రోగులకు ఎలాంటి చికిత్స, వైద్యం అందించడం లేదు. ఆ భవనం శిథిలావస్థకు చేరింది. ప్రస్తుతం రిమ్స్‌లోనే కుష్ఠుకు సంబంధించిన చికిత్స అందిస్తుండడంతో ఈ వార్డును ఎత్తివేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. దీంతోపాటు రిమ్స్‌లో ఆప్తాల్మిక్ యూనిట్ ఉంది. ఈ యూనిట్‌ను సైతం తొలగించనున్నారు.

పోస్టుల రేషనలైజేషన్..

జిల్లాలో రెండు డిప్యూటీ డీఎంహెచ్‌వో పోస్టులు ఉన్నాయి. ఆదిలాబాద్‌లో డిప్యూటీ డీఎంహెచ్‌వో కార్యాలయంతో పాటు డిప్యూటీ డీఎంహెచ్‌వో పోస్టు ఉంది. ఈ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్, హెల్త్ ఎడ్యుకేటర్, డిప్యూటీ పారామెడికల్ ఆఫీసర్, ఆప్తాలమిక్ ఆఫీసర్, డాటా ఎంట్రీ ఆపరేటర్ పనిచేస్తున్నారు. అలాగే ఉట్నూర్‌లో కూడా డిప్యూటీ డీఎంహెచ్‌వో కార్యాలయంతో పాటు డిప్యూటీ డీఎంహెచ్‌వో పోస్టు ఉంది. సిబ్బంది కూడా పనిచేస్తున్నారు. ఈ ఇద్దరు అధికారులను ఇకనుంచి ప్రోగ్రామ్ ఆఫీసర్లుగా నియమించనున్నారు. మిగతా సిబ్బందిని అవసరం ఉన్న పీహెచ్‌సీలకు, వైద్యారోగ్య శాఖకు సర్దుబాటు చేయనున్నారు. రిమ్స్‌లోని పీపీ యూనిట్‌లో ముగ్గురు మెడికల్ ఆఫీసర్లు, ఏఎన్ఎంలు పనిచేస్తున్నారు. ఆప్తాల్మిక్ యూనిట్‌లో మెడికల్ ఆఫీసర్, ఆప్తాల్మిక్ ఆఫీసర్, మేల్ నర్సింగ్ ఆఫీసర్ (ఎంఎన్ఓ) పోస్టులను కూడా సర్దుబాటు చేయనున్నారు.

పీహెచ్‌సీల పరిధిలో..

జిల్లాలో రిమ్స్ ఆస్పత్రితో పాటు 22 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, రెండు ఏరియా ఆస్పత్రులు, ఐదు పట్టణ ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయి. అయితే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మెడికల్ ఆఫీసర్ల పోస్టులు, స్టాఫ్ నర్సులు, ఏఎన్ఎంలు, ఇతర పోస్టులు ఒకేవిధంగా లేవు. కొన్ని పీహెచ్‌సీల్లో ముగ్గురు చొప్పున మెడికల్ ఆఫీసర్లు ఉండగా, మరికొన్ని చోట్ల ఇద్దరు, ఒకరు చొప్పున పనిచేస్తున్నారు. వీటన్నింటికీ ఒకేవిధంగా సిబ్బంది కేటాయింపు, అవసరం ఉన్నచోటకు పోస్టులు సర్దుబాటు చేసేలా ప్రభుత్వం జీవో విడుదల చేసింది. చాలా పీహెచ్‌సీల్లో పోస్టులు ఉండి కూడా అక్కడ ఉపయోగం లేకపోవడంతో సిబ్బంది ఖాళీగానే ఉంటున్నారు. అవసరం ఉన్నచోట పోస్టులు లేకపోవడంతో రోగులకు అవస్థలు ఎదురవుతున్నాయి. ఈ రేషనలైజేషన్ ద్వారా అన్ని పీహెచ్‌సీలో రోగులకు నాణ్యమైన వైద్యసేవలు అందే అవకాశం ఉంది.



GOVERNMENT OF TELANGANA
ABSTRACT

HM&FW DEPARTMENT – Strengthening of Primary Health Care & Rationalisation of Human Resources in Directorate of Public Health and Family Welfare, Hyderabad – Orders – Issued.

HEALTH, MEDICAL AND FAMILY WELFARE (B) DEPARTMENT

ORDER:

... Hyderabad. Director of Public Health & Family Welfare has further submitted that, there is non uniformity in posts sanctioned in Primary Health Centers (PHCs) and offices of District Medical & Health Officers (DMHOs). DPH&FW has therefore informed that for optimum utilization of these resources, there is a need to rationalise the human resources available with Director of Public Health & Family Welfare.

2. In the references 2nd and 3rd cited, after due consideration of the proposal of Director of Public Health & Family Welfare, orders have been issued creating and rationalizing certain posts.

3. After careful examination of the proposal of DPH&FW and taking into consideration orders issued in the references 2nd and 5th read above, the following orders are issued for strengthening primary health care:

A. (i) Hyderabad district has a large population with thousands of government & private health facilities. Currently, there is only one DM&HO for Hyderabad, leading to difficulties in performing both statutory and public health functions. In view of this, 5 additional DM&HO offices are hereby ...

వైద్యారోగ్య శాఖ జారీ చేసిన జీవో ప్రతి

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు



రాష్ట్ర వైద్యారోగ్య శాఖ రేషనలైజేషన్‌కు సంబంధించి జీవో నం.142ను జారీ చేసింది. పీపీ యూనిట్, టీహెచ్‌డబ్ల్యూ, ఆప్తాల్మిక్ యూనిట్లు తొలగించాలని ఆదేశించింది. వీటితో పాటు డిప్యూటీ డీఎంహెచ్‌వో పోస్టులు, అక్కడ పనిచేసే సిబ్బందిని సర్దుబాటు చేసేందుకు చర్యలు చేపడుతున్నాం. పీహెచ్‌సీల్లో కొన్ని చోట్ల ఎక్కువ, కొన్నిచోట్ల తక్కువ పోస్టులు ఉన్నాయి. అన్ని పీహెచ్‌సీలకు సమానంగా ఉండేలా చూస్తాం. దీంతో రోగులకు మరింత నాణ్యమైన వైద్యసేవలు అందుతాయి.

– నరేందర్ రాథోడ్, డీఎంహెచ్‌వో

టీచర్ల బదిలీలకు లైన్ క్లియర్



బదిలీల ప్రక్రియను పరిశీలిస్తున్న విద్యాశాఖాధికారులు (ఫైల్)

- హైకోర్టు గ్రీన్ సిగ్నల్
- మధ్యంతర స్టే ఉత్తర్వుల సవరణ
- ఉపాధ్యాయుల్లో హర్షం
- త్వరలో బదిలీ షెడ్యూల్

ఆదిలాబాద్‌టౌన్: ఉపాధ్యాయ బదిలీలకు ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. టీచర్ల బదిలీలపై మధ్యంతర స్టే ఉత్తర్వులను హైకోర్టు సవరించింది. యూనియన్ నాయకులకు 10 పాయింట్ల కేటాయింపును న్యాయస్థానం తప్పుబట్టడంతో పాటు స్పెషల్ పాయింట్లను నిలిపివేసింది. అయితే ఉపాధ్యాయ దంపతులకు అదనపు పది పాయింట్లు కేటాయించేందుకు అనుమతినిచ్చింది. బదిలీలు తుది తీర్పునకు లోబడే ఉంటాయని స్పష్టం చేసింది. దీంతో ఉపాధ్యాయుల బదిలీ, పదోన్నతులకు మార్గం సుగమమైంది. ఈ ఏడాది జనవరిలో ప్రభుత్వం బదిలీ, పదోన్నతుల షెడ్యూల్ ప్రకటించిన విషయం తెలిసిందే. ఉపాధ్యాయులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. విద్యాశాఖాధికారులు టీచర్లకు సంబంధించిన హార్డ్ కాపీలను సేకరించారు. వెబ్ ఆప్షన్ సమయంలో ఇతర జిల్లాలకు చెందిన కొంత మంది బదిలీల్లో ఉన్న పలు అంశాలపై కోర్టుకెళ్లడంతో అప్పట్లో ప్రక్రియ నిలిచిపోయింది. దాదాపు ఎనిమిది నెలల తర్వాత ఈ ప్రక్రియకు గ్రీన్ సిగ్నల్ లభించింది. బుధవారం న్యాయస్థానం తీర్పు వెలువరించింది. దీంతో బదిలీ, పదోన్నతుల కోసం ఎదురుచూస్తున్న టీచర్లలో హర్షం వ్యక్తమవుతుంది.

త్వరలో షెడ్యూల్ విడుదలకు అవకాశం

హైకోర్టు నుంచి బదిలీలకు గ్రీన్ సిగ్నల్ లభించడంతో ప్రభుత్వం త్వరలో బదిలీ షెడ్యూల్ విడుదల చేసే అవకాశం కనిపిస్తుంది. ఇప్పటికే బదిలీల కోసం ఉపాధ్యాయులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. జిల్లాలో మొత్తం 1,097 పోస్టులు ఖాళీగా ఉండగా, ప్రధానోపాధ్యాయ పోస్టులు 44 ఉన్నాయి. 24 మంది హెచ్ఎంలు ఒకే పాఠశాలలో ఐదేళ్ల పాటు పనిచేయడంతో వీరికి తప్పనిసరిగా బదిలీ జరగనుంది. ప్రధానోపాధ్యాయులకు సంబంధించి బది లీల్లో మొత్తం 66 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అలాగే స్కూల్ అసిస్టెంట్, ఎస్జీటీ పోస్టులకు సంబంధించి 1029 ఖాళీగా ఉన్నాయి. వీటిలో ఇదివరకు 502 పోస్టులు ఖాళీ ఉండగా, ఒకే పాఠశాలలో ఎనిమిదేళ్ల సర్వీసు పూర్తి చేసిన వారు జిల్లాలో 527 మంది టీచర్లు ఉన్నారు. జిల్లాలో బదిలీల కోసం 1,605 మంది దరఖాస్తు చేసుకున్నట్లు విద్యాశాఖాధికారులు పేర్కొంటున్నారు. వీరిలో పీజీ హెచ్ఎంలు 41 మంది, పీఎస్ హెచ్ఎంలు 19, ఎస్జీటీలు 857 మంది, స్కూల్ అసిస్టెంట్‌లు 488 మంది, లాంగ్వేజ్ పండితులు 119, పీఈటీలు 49, ఇతరులు ఐదుగురు దరఖాస్తు చేసుకున్నట్లు అధికారులు చెబుతున్నారు.

షెడ్యూల్ విడుదల చేయాలి



కోర్టు తీర్పును గౌరవిస్తూ ఉపాధ్యాయుల బదిలీలకు, పదోన్నతులకు ఆటంకాలు తొలిగినందున ప్రభుత్వం వెంటనే బదిలీ షెడ్యూల్ విడుదల చేయాలి. కొన్నేళ్లుగా ఉపాధ్యాయులు బదిలీ, పదోన్నతుల కోసం ఎదురుచూస్తున్నారు. ప్రక్రియను త్వరగా పూర్తి చేస్తే ఉపాధ్యాయులతో పాటు విద్యార్థులకు మేలు చేకూరుతుంది. అలాగే ఖాళీగా ఉన్న పోస్టులు సైతం భర్తీకి నోచుకుంటాయి.

– వెంకట్, యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి

సెకండ్ ఏఎన్ఎంలపై చర్యలకు సిద్ధం

- షోకాజ్ నోటీసులు జారీకి వైద్యారోగ్యశాఖ కసరత్తు
- సంఘ బాధ్యుల వివరాల సేకరణలో అధికారులు



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఏఎన్ఎంలు

ఆదిలాబాద్‌టౌన్: వైద్యారోగ్య శాఖలో పనిచేస్తున్న సెకండ్ ఏఎన్ఎంలపై ప్రభుత్వం చర్యలకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. సమ్మెలో ఉన్న ఏఎన్ఎంలు వెంటనే విధుల్లో చేరాలని, లేనట్లయితే కఠిన చర్యలకు పూనుకోనున్నట్లు సమాచారం. రాష్ట్ర వైద్యారోగ్య శాఖాధికారులు మౌఖికంగా జిల్లా అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిసింది. సమ్మె సంఘ బాధ్యులెవరు, ముందుండి ఎవరు నడిపిస్తున్నారనే వివరాలు పంపించాలని కోరినట్లు ఆ శాఖ ఉద్యోగుల ద్వారా తెలుస్తోంది. వారికి నోటీసులు జారీ చేయాలని మౌఖికంగా ఆదేశాలు ఇచ్చినప్పటికీ జిల్లాలో ఇంకా ఇంతవరకు ఎవరికి నోటీసులు జారీ చేయలేదు. జిల్లాలో సెకండ్ ఏఎన్ఎంలు 106 మంది పనిచేస్తున్నారు. వీరితో పాటు 104, పట్టణ ఆరోగ్య కేంద్రం, పీహెచ్‌సీల్లో కలిపి మొత్తం 200 మంది వరకు కాంట్రాక్ట్ ఏఎన్ఎంలు పనిచేస్తున్నారు. ఇదిలా ఉండగా షోకాజు నోటీసు ఇవ్వొద్దని సంఘం సభ్యులు బుధవారం వైద్యారోగ్య శాఖ అధికారులకు వినతిపత్రం అందజేశారు.

రెగ్యులర్ చేయాలనే డిమాండ్‌తో..

నోటిఫికేషన్ లేకుండా తమను రెగ్యులరైజ్ చేయాలనే డిమాండ్‌తో ఆగస్టు 15నుంచి సెకండ్ ఏఎన్ఎంలు సమ్మెకు పూనుకున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 5500 మంది సమ్మెలో ఉండగా, జిల్లాలో దాదాపు 200 మంది ఉన్నారు. ఈ విషయమై ఏఎన్ఎంల సంఘం అధ్యక్షురాలు పుష్పలతను వివరణ కోరగా, తమకు ఇప్పటివరకు ఎలాంటి షోకాజ్ నోటీసులు జారీ కాలేదని తెలిపారు. సమ్మెను విచ్ఛిన్నం చేసేందుకు ప్రభుత్వం ఇలా భయభ్రాంతులకు గురిచేస్తుందని, న్యాయమైన డిమాండ్ల సాధన కోసం సమ్మెను కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

షోకాజ్ నోటీసులు వెనక్కి తీసుకోవాలి

తమకు ప్రభుత్వం జారీ చేసిన షోకాజ్ నోటీసులు తక్షణమే వెనక్కి తీసుకోవాలని కాంట్రాక్ట్ ఏఎన్ఎంలు డిమాండ్ చేశారు. ఈమేరకుకలెక్టర్ రాహుల్‌రాజ్‌ను బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు.

ఐక్యతతోనే అభివృద్ధి

- కలెక్టర్ రాహుల్‌రాజ్



మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్ రాజ్

ఆదిలాబాద్‌రూరల్: ఐక్యతతోనే సమాజ అభివృద్ధి సాధ్యమని కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. మావల మండలం వాఘాపూర్ గ్రామంలో బుధవారం పౌర హక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రాజ్యాంగం ప్రకారం ప్రతీ పౌరునికి సమాన హక్కులు ఉంటాయన్నారు. ఇతరుల హక్కులకు భంగం కలిగించినట్లయితే చర్యలు తప్పవన్నారు. ప్రతీ మూడు నెలలకోసారి జిల్లాస్థాయి ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించి, నమోదైన కేసులు సత్వరం పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రతీ ఒక్కరు ఓటరు జాబితాలో తమ పేర్లు పరిశీలించుకోవాలని, లేనట్లయితే సంబంధిత ఫారాలు పూర్తిచేసి బీఎల్‌వోలకు అందజేయాలన్నారు. అంతకముందు గ్రామస్తులు పలు సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా.. వాటి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆర్డీవో స్రవంతి, ఎస్సీ సంక్షేమ అధికారి సునీతకుమారి, ఈడీ శంకర్, తహసీల్దార్ ఆరీఫా సుల్తానా, ఎంపీడీవో అరుణ, జెడ్పీటీసీ వనిత, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

19లోగా ఓటరుగా నమోదు చేసుకోవాలి

కైలాస్‌నగర్: అర్హులైన ప్రతి ఒక్కరూ సెప్టెంబర్ 19వరకు ఓటరుగా తమ పేరు నమోదు చేసుకోవాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ తెలిపారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఓటరు నమోదు, ఎన్నికల నిర్వహణపై గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో బుధవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. అక్టోబర్ 4న తుది ఓటరు జాబితా ప్రదర్శించనున్నట్లు పేర్కొన్నారు. ఓటరు జాబితాలో పేరు ఉన్నవారే ఓటు హక్కు వినియోగించుకునేందుకు అర్హులని స్పష్టం చేశారు. సంబంధిత పోలింగ్ కేంద్రాలు, తహసీల్దార్, కలెక్టర్ కార్యాలయంలో ఇప్పటికే ఓటరు జాబితా ప్రదర్శించామని, ఎన్‌వీఎస్‌పీ. ఇన్ పోర్టల్‌లో ఓటు హక్కును పరిశీలించుకోవాలన్నారు. జాబితాలో పేరు లేని వారు సంబంధిత ఫారాలు పూర్తి చేసి బూత్ స్థాయి అధికారులు, తహసీల్దార్ కార్యాలయంలో సమర్పించాలని సూచించారు. సమావేశంలో తహసీల్దార్లు శ్రీనివాస్, దిలీప్ కుమార్, ఆరిఫా సుల్తానా, ఎన్నికల విభాగం పర్యవేక్షకురాలు నలందప్రియా తదితరులు పాల్గొన్నారు.

మహనీయులను ఆదర్శంగా తీసుకోవాలి

- అన్నాభావు సాఠే మనుమడు సచిన్ భావు సాఠే

ఆదిలాబాద్‌రూరల్: మహనీయులను ఆదర్శంగా తీసుకొని వారి జీవిత చరిత్రలు, ఆశయాలు, సాధించిన విజయాలను తెలుసుకోవాలని అన్నాభావు సాఠే మనుమడు సచిన్ భావు సాఠే అన్నారు. అన్నాభావు సాఠే జయంతి పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని పిట్టల్‌వాడలో ఆయన పేరిట నిర్మించనున్న భవనానికి ఎమ్మెల్యే జోగు రామన్నతో కలిసి బుధవారం భూమి పూజ చేశారు. మహనీయుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళుర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సాహిత్యంలోనే కాకుండా మాంగ్ సమాజాన్ని జాగృతం చేసిన మహనీయుడు అన్నాభావు సాఠే అని కొనియాడారు. సాఠేకు భారతరత్న ప్రకటించాలన్నారు. ఎమ్మెల్యే రామన్న మాట్లాడుతూ, మహనీయుల చరిత్రను భావితరాలకు తెలియజేసేందుకు తెలంగాణ ప్రభుత్వం వారి జయంతి, వర్ధంతి కార్యక్రమాలను అధికారికంగా నిర్వహిస్తుందన్నారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ జనార్దన్ రాథోడ్, మాంగ్ సమాజ్ రాష్ట్ర అధ్యక్షుడు తులసిదాస్ గైక్వాడ్, అన్నాభావుసాఠే అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఉద్ధవ్ కాంబ్లే, నాందేవ్, యూనస్ అక్బానీ, దుర్గం శేఖర్ పాల్గొన్నారు.

'బీఆర్ఎస్‌తోనే మహారాష్ట్ర అభివృద్ధి'

ఇచ్చోడ: బీఆర్ఎస్ ప్రభుత్వం మహారాష్ట్రలో అధికారంలోకి వస్తే తెలంగాణ తరహాలో అభివృద్ధి చెందుతుందని అన్నాభావు సాఠే మనుమడు సచిన్ భావు సాఠే అన్నారు. మండలంలోని ముఖరా (కె) గ్రామాన్ని బుధవారం ఆయన సందర్శించారు. పలు అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలంగాణలో రైతులకు 24 గంటల ఉచిత కరెంటు, రైతుబీమా, రైతుబంధు వంటి పథకాలతో వ్యవసాయ రంగం అభివృద్ధి వైపు అడుగులు వేస్తుందన్నారు. అనంతరం సచిన్ సాఠేను సర్పంచ్ మీనాక్షి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సుభాష్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



భూమిపూజలో పాల్గొన్న ఎమ్మెల్యే జోగు రామన్న, సచిన్ భావు సాఠే

లోక్ అదాలత్ సద్వినియోగం చేసుకోవాలి

- జిల్లా జడ్జి వరప్రసాద్



మాట్లాడుతున్న జిల్లా జడ్జి వరప్రసాద్

ఆదిలాబాద్‌టౌన్: సెప్టెంబర్ 9న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌లో అన్ని రకాల కేసులు పరిష్కరించనున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ సీహెచ్‌వీఆర్ఆర్. వరప్రసాద్ అన్నారు. జిల్లా కోర్టు కార్యాలయంలో బుధవారం నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడారు. దేశవ్యాప్తంగా నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇందులో సివిల్, ప్రమాద, బ్యాంకు రికవరీ, టైటిల్ దావాలు వంటి అన్ని రకాల కేసులను ఇరువురి సమ్మతితో పరిష్కరించనున్నట్లు తెలిపారు. ఇందులో పరిష్కరించిన కేసులపై అప్పీల్‌కు వెళ్లేందుకు అవకాశముండదన్నారు. ఆదిలాబాద్, బోథ్, ఉట్నూర్ కోర్టుల్లో సుమారు 10వేల కేసులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకుని కేసులు పరిష్కరించుకోవాలని సూచించారు. అలాగే సెప్టెంబర్ 2న జెడ్పీ సమావేశ మందిరంలో మహిళ సాధికారత అంశంపై నిర్వహించనున్న కార్యక్రమానికి హైకోర్టు జడ్జి రానున్నట్లు తెలిపారు. జిల్లాలోని ఆయా కళాశాలల విద్యార్థినులతో పాటు గృహిణులు, ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో పనిచేస్తున్న మహిళలందరూ హాజరుకావాలని ఆయన కోరారు. ఇందులో జిల్లా న్యాయసేవ సంస్థ కార్యదర్శి క్షమాదేశ్‌పాండే పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం



అవగాహన కల్పిస్తున్న యశోద

ఆదిలాబాద్‌టౌన్: అంగన్‌వాడీ కార్యకర్తలు మహిళ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా మహిళ సాధికారిత కేంద్రం మిషన్ కోఆర్డినేటర్ యశోద అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని గాంధీ పార్కులో అంగన్‌వాడీ కార్యకర్తలకు అవగాహన కల్పించారు. బేటీ బచావో.. బేటీ పఢావో పథకం, సుకన్య సమృద్ధి, లింగ వివక్షత, మహిళ చట్టాలు, గృహహింస, బాల్య వివాహాలు, వరకట్న వేధింపుల గురించి వివరించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఫర్హా, జయశ్రీ,, సిబ్బంది కృష్ణవేణి, కోటేశ్వర్, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

క్లుప్తంగా

108లో ప్రసవం



శిశువును అందిస్తున్న సిబ్బంది

సిరికొండ: మండల కేంద్రానికి చెందిన గర్భిణి రేష్మా పురిటినొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు 108కి సమాచారం అందించారు. 108 సిబ్బంది గర్భిణిని ఇచ్చోడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గంమధ్యలో సుంకిడి గ్రామం వద్ద మగ బిడ్డకు జన్మనిచ్చింది. తల్లిబిడ్డలు క్షేమంగా ఉన్నారని ఈఎంటీ కాశీనాథ్, పైలెట్ ప్రవీణ్ కుమార్ అన్నారు.

డివిజన్ వినతిని ప్రభుత్వానికి చేరవేయండి



పీవోకు విన్నవిస్తున్న సభ్యులు

బోథ్: బోథ్ డివిజన్ ఏర్పాటుపై ప్రభుత్వానికి సమాచారాన్ని చేరవేయాలని ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయికి బుధవారం బోథ్ డివిజన్ సాధన సమితి సభ్యులు విన్నవించారు. గతవారం తాము ఇచ్చిన వినతిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. లేకుంటే రానున్న ఎన్నికలను బహిష్కరిస్తామని తెలిపారు. బుధవారం ఓటరు ప్రక్రియ గురించి ఆమె అధికారులతో సమావేశం నిర్వహించారు. 18ఏళ్లు నిండిన ప్రతీ ఒక్కరిని ఓటరుగా నమోదు చేయాలని, ఓటింగ్ గురించి ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.

విరబూసిన రాఖీ పుష్పాలు



రాఖీ పుష్పం

తాంసి: ప్రకృతి పరంగా పూసిన రాఖీ పుష్పాలు తాంసి మండల కేంద్రంలో కనువిందు చేస్తున్నాయి. మండల కేంద్రానికి చెందిన శ్రీధర్‌రెడ్డి తన ఇంటి వద్ద పెంచుకున్న తీగజాతి మొక్కలు పూసిన ఈ పుష్పాలు రాఖీ పుష్పాలుగా ఆకట్టుకుంటున్నాయి. పుష్పం చుట్టు మొదటగా రెక్కలు ఉండి మధ్యలో ఆకట్టుకునే విధంగా ఐదు చిన్న సైజులో ఆకులు ఉంటాయి. వీటిని పంచ పాండవుల పుష్పాలు అని కూడా అంటారని గ్రామస్తులు తెలుపుతున్నారు.



నీకు నేను.. నాకు నీవు రక్ష

అన్నా చెల్లెళ్లు, అక్కా తమ్ముళ్ల మధ్య ప్రేమానురాగాలకు ప్రతీకగా జరుపుకునే పండుగనే రాఖీ. ఈ పండుగను ఇప్పుడు దేశవ్యాప్తంగా అందరూ ఘనంగా జరుపుకుంటున్నారు. సోదరి తన సోదరుడు హోన్నత శిఖరాలకు ఎదగాలని కోరుకుంటూ రాఖీ కట్టి ఎల్లప్పుడూ అన్నకు అండగా ఉంటానని చెప్తుంది. సోదరి కట్టిన రక్షాబంధనాన్ని స్వీకరించిన అన్న తానెప్పుడూ చెల్లెలికి రక్షగా ఉంటానని ఈ పండుగ ద్వారా తెలియజేస్తారు. సమాజంలో బంధాలు, అనుబంధాలు దూరమవుతున్న తరుణంలో రక్షాబంధన్ పండుగ అన్నాచెల్లెళ్లు, అక్కా తమ్ముళ్ల అనుబంధాలను బలోపేతం చేస్తుంది. సోదర సోదరీమణుల మధ్య ఉండే అనుబంధానికి, ప్రేమానురాగాలకు అద్దం పట్టే పండుగ కావడంతో మానవ సంబంధాల మెరుగుదలకు, విచక్షణకు ఇది ఎంతో దోహదం చేస్తుంది. ఆత్మీయుల మధ్య అనుబంధాలకు, ఐకమత్యానికి, పరస్పర సహకారానికి చిహ్నంగా రక్షాబంధనం నిలుస్తుంది. రాఖీ పండుగ సందర్భంగా జిల్లాలోని సోదరులకు రాఖీ కట్టేందుకు సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన అక్కా చెల్లెళ్లు తమ అభిప్రాయాలను సాక్షితో పంచుకున్నారు.

- సోదరులకు రాఖీ కట్టేందుకు సుదూరాల నుంచి వచ్చిన అక్కాచెల్లెళ్లు
- అనుబంధాలను బలోపేతం చేస్తున్న రక్షా బంధన్
- తమ అభిప్రాయాలను పంచుకున్న సోదరీమణులు

నిర్మల్ ఖిల్లా: అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీక రాఖీ పండగ. రాఖీని కట్టేందుకు, రక్షాబంధన్ వేడుకలను నిర్వహించుకునేందుకు ఎక్కడెక్కడో దూరాన ఉన్న అన్నాచెల్లెళ్లు, అక్కాతమ్ముళ్లు సొంత ప్రాంతాలకు తరలివస్తుంటారు. ఈ క్రమంలో వారిమధ్య అనుబంధానికి రక్షా కవచంగా కట్టే ఈ రాఖీ ఎంతో ప్రత్యేకమైనది. అనాధికాలం నుంచి సంప్రదాయంగా వస్తున్న ఈ రక్షాబంధన్ వేడుక సోదరి సోదరీమణుల అనుబంధాన్ని మరింత దృఢపరుస్తోంది. ఈ క్రమంలో వారి జీవితాలను తీర్చిదిద్దిన ఉదంతాలు ఎన్నో ఉన్నాయి. అలాంటి వారి అభిప్రాయాలతో సాక్షి కథనం..

ఐదుగురు చెల్లెళ్ల అనుబంధాల రాఖీ...

నిర్మల్ జిల్లా కేంద్రంలో నివాసముండే అర్ల గంగాధర్ ప్రస్తుతం ఎక్సైజ్ సబ్ ఇన్స్పెక్టర్‌గా పనిచేస్తున్నాడు. ఇతడికి గంగామణి, సంతోషిణి, లావణ్య, భాగ్యలక్ష్మి, ఉదయరాణి ఐదుగురు చెల్లెల్లు ఉన్నారు. వీరి స్వగ్రామం ఆదిలాబాద్ జిల్లాలోని సొనాల. గంగాధర్ వృత్తిరీత్యా నిర్మల్ జిల్లాలో పలు ప్రాంతాల్లో ఉపాధ్యాయుడిగా, ఎంపీడీవోగా, డీపీవోగా పనిచేశారు. ప్రస్తుతం జిల్లా కేంద్రంలోని భాగ్యనగర్‌లో స్థిరపడ్డాడు. దిగువమధ్య తరగతి కుటుంబం నుంచి వచ్చిన వీరు ప్రస్తుతం ఎక్సైజ్ ఎస్సైగా విధులు నిర్వహిస్తున్నారు. ఇతను ఐదుగురు చెల్లెళ్లను తన మార్గనిర్దేశనంలో ఉన్నత చదువులు చదివించి అందరినీ ఉన్నతంగా తీర్చిదిద్దారు. వీరిలో ఇద్దరు డిగ్రీ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్‌లుగా పనిచేస్తుండగా.. మరో ఇద్దరు ప్రభుత్వ ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నారు. వీరందరూ ఏటా రాఖీ పౌర్ణమి పండగను ఒకేచోట జరుపుకుంటారు. జీవితాల్లో ఎక్కడెక్కడో స్థిరపడిన పండగ రోజు మాత్రం ప్రత్యేకంగా కలుసుకొని వేడుకలను జరుపుకుంటారు. తోబుట్టువులుగా చిన్నతనం నుండి కలిసి పెరిగినా, ప్రస్తుతం కుటుంబ బాధ్యతలలో ఎక్కడెక్కడో స్థిరపడ్డారు. తమకిష్టమైన తన అన్నయ్య మార్గదర్శనంలో కష్టపడడం తోనే ఈ స్థితిలో ఉన్నామని ఈ చెల్లెళ్లు అంటున్నారు. వృత్తిరీత్యా ఎంత బిజీగా ఉన్నా తమ అన్నయ్యను కలుసుకొని సంతోషంగా పండగను జరుపుకుంటున్నామని ఐదుగురు చెల్లెల్లు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. బుధవారం సోదరుడికి రాఖీ కట్టి స్వీట్లు తినిపించారు.

రాఖీ కట్టి.. హెల్మెట్ పెట్టి



రాఖీ కడుతున్న సోదరి

ఖానాపూర్:ఆ ఇద్దరు చట్టాల గురించి చెప్పేవారే.. ఒకరు రూ ల్స్ గురించి మాట్లాడితే... ఇంకొకరు రూల్స్ గురించి వాదిస్తారు. అన్నకు రాఖీ కట్టి.. హెల్మెట్ పెట్టు అనే నినాదం మేరకు సోదరుడికి గతంలో పలుమార్లు హెల్మెట్‌ను అందించింది. మండలంలోని మస్కాపూర్ గ్రామానికి చెందిన తునికి రవీందర్ భార్య అరుణ భైంసా కోర్టులో అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా పనిచేస్తుంది. అరుణ సోదరుడు భానుకర్ కృష్ణ ప్రస్తుతం నిజామాబాద్ జిల్లా వర్ని ఎస్సైగా విధులు నిర్వహిస్తున్నాడు.

బంధం ఎంతో ఆత్మీయం

ఉట్నూర్‌రూరల్: అన్నాచెల్లెల అనుబంధానికి ప్రతీ రూపమే రాఖీ అని లక్కారం మాజీ సర్పంచ్ మర్సుకోల తిరుపతి అన్నారు. రక్ష బంధన్ సందర్భంగా లక్కారం గ్రామ మహిళలు ఆయనకు రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలియజేశారు. అదే విధంగా ఆయా ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల్లో రక్షా బంధన్ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. సరస్వతి జ్ఞాన విద్యాలయం పాటశాలలో విద్యార్థులు ఒకరినొకరు రాఖీలు కడుతూ శుభాకాంక్షలు తెలియచేసుకున్నారు.



రాఖీకడుతున్న మహిళలు

దీక్షాపరులకు రాఖీలు కట్టిన విద్యార్థులు



దీక్షలోని వారికి రాఖీ కడుతున్న విద్యార్థులు

బోథ్: బోథ్‌ను డివిజన్ చేయాలని డిమాండ్ చేస్తూ చేస్తున్న దీక్షలు బుధవారానికి 46వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలో కూర్చున్న దీక్షా పరులకు నాగభూషణం పాఠశాల విద్యార్థులు రాఖీలు కట్టారు. బోథ్ డివిజన్ సాధించే వరకు పోరాటాన్ని ఆపవద్దని విద్యార్థులు తెలిపారు. ఉద్యమ నిర్వహణ నిమిత్తం ఆ పాఠశాల కరస్పాండెంట్ కిశోర్ రూ.5వేలను బోథ్ డివిజన్ సాధన సమితి సభ్యులకు అందించారు.

అమెరికాకు రాఖీ పంపుతాను



తాంసి: మా సొంత గ్రామం భీంపూర్ మండలం కరంజి(టి). ప్రస్తుతం వివాహం జరగడంతో మహారాష్ట్రలోని పాటన్‌లో ఉంటున్నాను. తమ్ముడు వృత్తిరీత్యా అమెరికాలో ఉంటాడు. అన్నాచెల్లెల అనుబంధానికి గుర్తుగా రాఖీని పంపుతాను.పదేళ్లకు పైగా రాఖీని పంపిస్తున్నాను.

– రజని, గృహిణి, మహారాష్ట్ర

మా అనుబంధాన్ని రెట్టింపు చేస్తుంది



గుడిహత్నూర్: మాది నాందేడ్ జిల్లాలోని నిస్‌పూర్. నేను ఏటా రాఖీ పండగకు నా ముగ్గురు తోబుట్టులకు రాఖీ కట్టి వారితో సరదాగా గడుపుతా. ఈ రాఖీ పండుగ మా అనుబంధాలు, ప్రేమాను రాగాలను రెట్టింపు చేస్తుంది. ఈ రాఖీ పండుగ మరింత ఆప్యాయతకు నీడగా నిలుస్తోంది.

– కాగ్నే ఇందుబాయి, నిస్‌పూర్, మహారాష్ట్ర

దూది గొండలే ప్రత్యేకం

- భైంసాలో నేటికీ అవే పంపిణీ
- రాఖీ పౌర్ణమికి ముందుగానే ఇంటింటికీ ఇస్తారు



దూదిగొండలు

భైంసా: అక్కాతమ్ముళ్ల అనురాగానికి, అన్నాచెల్లెల్ల ఆత్మీయతకు ప్రతీకగా నిలిచే రాఖీ పౌర్ణమి సందర్భంగా భైంసా ప్రాంతంలో పూజారులు, అర్చకులు ఇంటింటా ఇప్పటికీ దూదిగొండలే ఇస్తారు. ఈ ప్రాంతం మహారాష్ట్రకు ఆనుకుని ఉండడంతో రాఖీలను గొండలు అని పిలుస్తారు. సన్నని దారానికి దూదిని పసుపులో, కుంకుమలో, చంద్రం, గులాలు ఇలా పూజకువాడే వాటిలో కలుపుతారు. ఇలా కలిపిన దూదినుంచి దారాన్ని బయటకుతీసి గొండగా కడుతారు. ఇలా తయారుచేసిన గొండలను గ్రామాల్లో ముందుగా అక్కడి పూజారులు ప్రత్యేక పూజలు చేస్తారు. పౌర్ణమికి రెండు రోజుల ముందుగానే ఇంటింటికి వెళ్లి ఈ దూదిగొండలను పంచిపెడతారు. దూదిగొండలు తీసుకున్నవారు ఇంటికివచ్చిన పూజారుల కాళ్లు కడిగి వారిని లోనికి ఆహ్వానిస్తారు. ఇచ్చిన దూదిగొండలు తీసుకుని అందుకు ఇంట్లో పండించిన బియ్యం, జొన్నలు, పప్పులు దానం చేస్తుంటారు. రాఖీ పౌర్ణమి రోజున ఇంటికి వచ్చే ఆడపడుచులు పూజారులు ముందుగా ఇచ్చిన ఈ దూదిగొండలనే కడతారు.

ఆడబిడ్డలకు పుట్టింటి కానుకలు...

తోబుట్టువులకు దూదిగొండలు చేతికి కట్టగానే కానుకలు అందిస్తారు. సోదరులు పుట్టింటి ఆడపిల్ల కాళ్లుమొక్కి నగదు, బట్టలు కానుకగా ఇస్తుంటారు. రాఖీ పౌర్ణమి నుంచి పొలాల అమావాస్య వరకు 15 రోజులపాటు వీలు దొరికినప్పుడల్లా దూర ప్రాంతంలో ఉండే పుట్టింటి ఆడపడుచు ఎప్పుడైనా వచ్చి తోబుట్టువులకు రాఖీ కట్టి వెళ్తుంది. రాఖీ పౌర్ణమి అంటే ఇక్కడి వారు ప్రత్యేకంగా భావిస్తారు.

సంఘాల ఆధ్వర్యంలో...

ఇంట్లో రాఖీ పౌర్ణమి సందర్భంగా తోబుట్టువులతో పండుగ చేసుకున్న అనంతరం అంతా బయటకు వస్తారు. సంఘాల ఆధ్వర్యంలో సామూహికంగా రాఖీ పౌర్ణమి వేడుకలు జరుపుకుంటారు. ప్రతీ పల్లెటూరిలోనూ ఈ వేడుకలు వైభవంగా జరుగుతాయి. హిందువాహిని, ఆర్ఎస్ఎస్‌లతోపాటు సరస్వతీ శిశుమందిరాల విద్యార్థులు డివిజన్‌లోని అన్ని ప్రాంతాలకు వెళ్లి రాఖీ పౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహిస్తారు.

తీజ్ ఉత్సవాలు ప్రారంభం

- సంప్రదాయ పూజలు.. ఉత్సాహంగా పాల్గొననున్న యువతులు



తీజ్ ఉత్సవాల్లో గిరిజన మహిళలు, యువతులు

ఉట్నూర్‌రూరల్: శ్రావణ మాసాన్ని పురస్కరించుకొని ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనులు తీజ్ ఉత్సవాలను బుధవారం సాయంత్రం నుంచి ప్రారంభించారు. ఏజెన్సీలోని గిరిజన తండాల్లో తీజ్ ఉత్సవాలను ఘనంగా జరుపుకునేందుకు గిరిజనులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. బుధవారం సాయంత్రం నుంచి రాత్రి వరకు మండలంలోని లింగోజీతాండ, హస్నాపూర్, సుభాశ్‌నగర్ తదితర గ్రామాల్లో ప్రత్యేక పూజల నడుమ ఉత్సవాలను ప్రారంభించారు. పెళ్లికాని యువతులు తమ జీవితాల్లో కొత్త మలుపులు వచ్చేలా అన్ని శుభకార్యాలు జరిగేలా ఆరాధ్య దైవాన్ని ప్రార్థిస్తూ ఈ వేడుకలను ప్రారంభిస్తారు. తొమ్మిది రోజుల పాటు నిర్వహించే ఈ తీజ్ ఉత్సవాల్లో యువతులు ఉపవాస దీక్షల నడుమ భక్తిశ్రద్ధలతో పండుగను జరుపుకుంటారు. రాఖీ పౌర్ణమిని పురస్కరించుకొని ఈ ఉత్సవాలను నాయక్ ఇంటి వద్ద ప్రారంభిస్తారు. కృష్ణాష్టమి వరకు తొమ్మిది రోజుల పాటు ఈ వేడుకలు నిర్వహించుకుంటారు. రాఖీ పౌర్ణమిని పురస్కరించుకొని లంబాడాలు తమ నాయక్ ఇంటి వద్ద పెద్దల సమక్షంలో కుల దైవం జగదాంబాదేవి, సేవాలాల్ మహరాజ్ ఆశీస్సులతో వేడుకలు ప్రారంభిస్తారు. సంప్రదాయ పాటలు పాడుతూ నేరేడు చెట్టు వద్ద ఆడపడుచులు ప్రత్యేక పూజలు చేస్తారు. అక్కడి నుంచి పాటలు పాడుతూ నాయక్ ఇంటి వద్దకు చేరుకొని ముందుగా నాయక్, పెద్ద మనుషుల చేతుల మీదుగా వెదురుతో తయారు చేసిన బుట్టలను తీసుకుని అడవి నుంచి తీసుకొచ్చిన పుట్ట మట్టిని బుట్టలో నింపి గోదుమ విత్తనాలు నాటుతారు. అనంతరం బుట్టలను భద్రంగా ఒక దగ్గరపెట్టి అవి మొలకెత్తే వరకూ ప్రతీరోజు ఉదయం, సాయంత్రం నీళ్లు పోస్తుంటారు. ఈ విత్తనాలు మొలకెత్తాక ఆ బుట్టలతో సంప్రదాయ రీతిలో తమ దైవాల వద్ద ప్రత్యేక పూజలు చేసి ప్రతీరోజు తీజ్ సంబరాలు జరుపుకుంటారు. ఈ సంబరాల్లో వారి ఆటపాట నృత్యాలు అందరిని ఆకట్టుకునేలా ఉంటాయి.

ఘనంగా దీక్ష గురువు జన్మదిన వేడుకలు

- వెండి కిరీటాన్ని బహూకరించిన భక్తులు
- హాజరైన మాజీ ఎమ్మెల్సీ రాములునాయక్



ప్రేంసింగ్ మహరాజ్ జన్మదిన వేడుకల్లో భక్తులు

నార్నూర్: మండలంలోని కొత్తపల్లి–హెచ్ గ్రామంలోని జాతీయ బంజారా దీక్ష భూమి వద్ద దీక్ష గురువు శ్రీసద్గురు ప్రేంసింగ్ మహరాజ్ జన్మదిన వేడుకలను రాఖీ పౌర్ణిమి సందర్భంగా బుధవారం ఘనంగా నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. వెండి కిరీటాన్ని భక్తులు బహూకరించారు. మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్ దీక్ష భూమిని సందర్శించి మహరాజ్ ఆశీర్వాదం తీసుకున్నారు. టీఎస్‌జీవోల సంఘం అధ్యక్షుడు అజ్మీరా శ్యాంనాయక్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు డాక్టర్ రాథోడ్ గణేశ్, రాథోడ్ శేషరావు ఉన్నారు.

గుడుంబా తయారీ కేంద్రాలపై దాడులు



గుడుంబాను పట్టుకున్న ఎక్సైజ్ అధికారులు

మామడ: మండలంలోని వెంకటపూర్ సమీపంలోని గోదావరిలో బుధవారం ఎక్సైజ్ అధికారులు గుడుంబా తయారీ కేంద్రాలపై దాడులు నిర్వహించారు. ప్లాస్టిక్ డ్రమ్ముల్లో నిల్వ చేసిన 900 లీటర్ల బెల్లంపానకాన్ని పట్టుకుని ధ్వంసం చేశారు. ఎక్సైజ్ ఎస్సై రాయబారపు రవికుమార్, సిబ్బంది నరెందర్, ముత్యం, ఇర్ఫాన్, భాస్కర్ పాల్గొన్నారు.

వికటించిన వైద్యం



పాప ఒంటిపై దద్దుర్లు

బోథ్: మండల కేంద్రానికి చెందిన కూన రాము కూతురు కుషాగ్రికి వైద్యం వికటించింది. రాము తెలిపిన వివరా ల ప్రకారం.. రెండున్నరేళ్ల చిన్నారి కుషాగ్రి ఈ నెల 26వ తేదీన రాత్రి కడుపునొప్పి రావడంతో స్థానిక ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లాడు. విధుల్లోని వైద్యుడు కడుపునొప్పికి సిరప్, మందులు రాసిచ్చాడు. మరుసటి రోజు పాప శరీరంపై దద్దుర్లు వచ్చాయి. దీంతో మరింతగా అస్వస్థతకు గురైంది. మళ్లీ మండల కేంద్రంలోని ఓ వైద్యుడి దగ్గరికి వెళ్లి చూపించగా ఆ మందులను వాడొద్దని తెలిపాడు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లిగా విధుల్లోని సిబ్బంది దుర్భాషలాడారు. దీంతో చేసేది లేక నిర్మల్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లగా రక్తంలో ఇన్‌ఫెక్షన్ ఉందని తెలిపారు. బోథ్ ఆస్పత్రిలో చిన్నపిల్లల డాక్టర్ లేక ఈ దుస్థితి నెలకొందని, తన కూతురికి ఏమైనా జరిగితే పూర్తి బాధ్యత వైద్యులే వహించాలని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు.

మట్కా నిర్వాహకుడి అరెస్టు

ఆదిలాబాద్‌టౌన్: మట్కా నిర్వాహకుడు షేక్ ఇర్షద్‌ను టూటౌన్ పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. ఎస్సై రమణారెడ్డి వివరాల ప్రకారం.. పట్టణంలోని సుందరయ్యనగర్‌లో సుల్తాన అనే మహిళ ఇంటిని రెండు నెలల క్రితం అద్దెకు తీసుకుని మట్కా నిర్వహిస్తున్నాడు. పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా అనుమానం వచ్చి తనిఖీ చేయగా మట్కా చీటీలు లభ్యమైనట్లు తెలిపారు. ఇతడి నుంచి రూ.3వేల నగదుతో పాటు రెండు మట్కా పుస్తకాలను స్వాధీనం చేసుకున్నారు. మరో మట్కా నిర్వాహకుడు మహ్మద్ లతీఫ్ పరారయ్యాడు. అద్దెకు ఇల్లిచ్చిన యజమాని సుల్తానపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

గోపాలమిత్ర కేంద్రాల ఏర్పాటుకు దరఖాస్తుల స్వీకరణ

కైలాస్‌నగర్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ పరిధిలో ఖాళీగా ఉన్న గోపాలమిత్ర కేంద్రాల ఏర్పాటుకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా పశుగణాభివృద్ధి అధికారి కిషన్ ఒక ప్రకటనలో బుధవారం తెలిపారు. నిర్మల్ జిల్లాలో కుభీర్ మండలంలోని మర్లగొండ, భైంసా మండలం వానల్‌పహాడ్, బాసర మండలం కౌట, మంచిర్యాల జిల్లాలోని కోటపల్లి మండలంలోని దేవులవాడ, కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలో పెంచికల్‌పేట్ మండలంలోని బొంబాయి గూడ, లింగాపూర్ మండలంలోని ఫటకల్‌మంగి, రెబ్బెన మండలంలోని గోలేటిలో ఖాళీగా ఉన్నట్లుగా తెలిపారు. వీటికి పదో తరగతి ఉత్తీర్ణులై, 18–35 ఏళ్ల మధ్య వయస్సు కలిగి ఉన్న వారు అర్హులన్నారు. అలాంటి వారు ఫొటోతో కూడిన స్థానిక నివాస ధృవీకరణ పత్రం(ఆధార్ లేదా రేషన్‌కార్డు) ఫొటోతో తమ దరఖాస్తులను సెప్టెంబర్ 11వ తేదీ సాయంత్రం 5గంటల్లోగా జిల్లా కేంద్రంలోని జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ కార్యాలయంలో అందజేయాలని ఆయన సూచించారు.

కేంద్ర, రాష్ట్ర పథకాల అమలుపై అధ్యయనం

- మూడో రోజు ట్రెయినీ ఐఏఎస్‌ల పర్యటన



పత్తిసాగు పరిశీలిస్తున్న ట్రెయినీ కలెక్టర్లు

ఇచ్చోడ: మండంలోని మేడిగూడలో బుధవారం ట్రెయినీ ఐఏఎస్ అధికారులు మారినవిక్టర్, అభినవ్ ఖండేల్‌వాల్, నెల్సన్‌మంగ, కింగ్‌తెహరింగ్, దివ్య జైన్, ప్రనుశ్‌శర్మ, దుర్గప్రసాద్ పర్యటించారు. ప్రతీ ఇంటికి తిరుగుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల అమలుపై గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. ప్రజా పంపిణీ వ్యవస్థ, అంగన్‌వాడీ, ప్రభుత్వపాఠశాల పనితీరును పరిశీలించారు. పాఠశాలల్లో హాజరు పట్టికను పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రం ద్వారా చిన్నారులకు, గర్భిణులకు అందుతున్న పౌష్టికాహారం వివరాల రికార్డులు పరిశీలించారు. గర్భిణులతో ప్రత్యేకంగా మాట్లాడారు. ఆదివాసీ ఆచార, సంప్రదాయలను గ్రామస్తుల ద్వారా అడిగి తెలుసుకున్నారు. పక్కనే ఉన్న పంట పొలాల్లో పత్తి, సోయా పంటలను పరిశీలించారు. సాగుపై పెట్టుబడులు, పంటలపై వస్తున్న లాభాలను రైతులను అడిగి తెలుసుకున్నారు. వారి వెంట పంచాయతీ కార్యదర్శి రాజు, సర్పంచ్ భీంరావు ఉన్నారు.

ఆరోగ్య పథకాలు పక్కాగా అమలు చేయాలి



సూచనలిస్తున్న రీజినల్ డైరెక్టర్ అనురాధ

జైనథ్: ప్రతీ పీహెచ్‌సీ, సబ్‌సెంటర్లలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆరోగ్య పథకాలు పక్కాగా అమలు చేయాలని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వశాఖ రీజినల్ డైరెక్టర్ డాక్టర్ అనురాధ ఆదేశించారు. మంగళవారం ఆమె మండలంలోని జామ్ని గ్రామంలోని సబ్‌సెంటర్‌ను లెప్రసీ జాయింట్ డైరెక్టర్ జాన్‌బాబుతో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు రికార్డులు, అందుబాటులోని మందులపై ఆరా తీశారు. అనంతరం లెప్రసీ కేసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాతాశిశు సంక్షేమంపై మహిళలకు అవగాహన కల్పించారు. సీజనల్ వ్యాధుల లక్షణాలు, ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నివారణ చర్యలపై వివరించారు. ప్రభుత్వాస్పత్రుల్లో ప్రసవాలు పెరిగేలా చూడాలని, మాతాశిశు సంక్షేమం కోసం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. జిల్లా లెప్రసీ అండ్ టీబీ కంట్రోల్ అధికారి మెట్పెల్లివార్ శ్రీకాంత్, సిబ్బంది ఉన్నారు.

దేవర వస్తుందని నమ్మించి టోకరా



ఒప్పంద పత్రం చూపిస్తున్న బాధితురాలు

నేరడిగొండ: దేవర వస్తుందని ఓ మహిళ నుంచి మరో మహిళ డబ్బులు దండుకున్న ఘటన మండలంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళితే.. మండలంలోని గాజిలి గ్రామానికి చెందిన గోడం రేణుకబాయి నుంచి బోథ్ మండల కేంద్రంలోని సాయినగర్ కాలనీకి చెందిన రాయిసిడం లక్ష్మి అనే మహిళ డబ్బులు తీసుకొని ఇవ్వకపోవడంతో విషయం బయటకు వచ్చింది. రాయిసిడం లక్ష్మికి దేవర వస్తుందని రేణుకబాయి అనారోగ్యం బారిన పడటంతో ఆమె వద్దకు వెళ్లింది. ఇలా వారి మధ్యలో స్నేహం ఏర్పడింది. దీంతో రూ.50వేలు అవసరం ఉందని తీసుకుంది. అవి తిరిగి ఇవ్వకముందే మళ్లీ మూడు నిమ్మకాయలు చేతిలో ఉంచి రూ.50వేలు నగదు, తులం నాలుగు మాసాలా బంగారు ఆభరణాలు కూడా తీసుకుంది. కొన్ని రోజుల తర్వాత డబ్బులు, బంగారం అడగగా ఇవ్వకపోవడంతో రేణుకబాయి, ఆమె భర్త భీంరావులు లక్ష్మిని నిలదీశారు. దీంతో ఆమె వీరిపై తిరగబడి నువ్వే నా ఇంట్లో దొంగతనం చేశావంటూ బోథ్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. విషయం బయట పడటంతో కులపెద్దలు కిస్తుల రూపంలో చెల్లించాలని ఒప్పంద పత్రం రాశారు. అయినప్పటికీ డబ్బులు ఇవ్వకపోవడంతో బాధితులు బుధవారం మండల కేంద్రంలో వారి బాధను చెప్తుతూ మోసపోయామని, మాకు న్యాయం చేయాలని కోరారు. మూఢనమ్మకాలపై అవగాహన కల్పించి ఇలాంటివి పునరావృతం కాకుండా చూడాలని పలువురు కోరుతున్నారు.